ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం పేపర్-1 జనరల్ స్టడీస్ పరీక్షలకు 9926 మంది దరఖాస్తు చేసుకోగా 7406 మంది 74.6 శాతం హాజరు అయ్యారు. 2520 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం పేపర్-2 రీజనింగ్, అర్థమెటిక్, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్ట్ పరీక్షలకు 9926 మంది దరఖాస్తు చేసుకోగా 7375 మంది హాజరయ్యారు. 74.29 శాతం మంది హాజరయాయరు. 2551 మంది గైర్హాజరు అయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. జిల్లా ఎస్పీతో పాటు అనంతపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ మహబూబ్‌బాషా, త్రీటౌన్ సిఐ కత్తి శ్రీనివాసులు ఉన్నారు. ఎస్ఎస్‌బిఎన్ పరీక్ష కేంద్రంలో పరీక్షా సమయానికి రాని అభ్యర్థులు ఇద్దరిని అనుమతించకపోవడంతో వారు వెనుతిరిగారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

జగన్న ఇళ్ల స్థలాల కోసం సిపిఎం పోరాటం

10 నుంచి 12వ తేదీ వరకు ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్లు పూర్తి చేయడానికి ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాలని, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్యలతో కలిసి ఆయన మాట్లాడారు. జగనన్న ఇళ్లు జిల్లాకు 68,288 కేటాయించి కేవలం 6,045 మాత్రమే పూర్తి చేయడం పేదలను వంచించడమేనని విమర్శించారు. సంక్రాంతి నాటికి 15 వేల ఇళ్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. ఈ పద్ధతుల్లో ఇళ్ల నిర్మాణం జరిగితే వచ్చే ఐదేళ్లకు కూడా మంజూరైన ఇళ్లు పూర్తికావన్నారు. పునాది దశలో ఆగిపోయినవి 26 వేల ఇళ్లు ఉన్నాయని తెలిపారు. అర్జీ పెట్టుకున్న 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాలు ఇస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కావడం లేదన్నారు. ఇంటి స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న వారిలో 10 వేల మందిని అర్హులుగా గుర్తించినా ఒక్కరికీ స్థలం చూపలేదన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని కోట్ల రూపాయలు వ్యాపారాలు చేసుకుంటున్నా అరికట్టడం లేదన్నారు. కంచే చేను మేసినట్లు కొందరు ప్రజా ప్రతినిధులు కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములు వందల ఎకరాల్లో ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. వీరికి కొందరు రెవెన్యూ అధికారులు తోడుకావడంతో పేదల ఇళ్లకు స్థలాలు దొరకడం లేదన్నారు. భూమి ధరలు, ఆకాశానంటుతున్న ఈ పరిస్థితుల్లో మధ్యతరగతి వారు కూడా ఇళ్ల స్థలాలు కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే పేదలకు ఇంటి స్థలం కావాలంటే ఉద్యమాలు తప్ప వేరే మార్గం లేదన్నారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ఈ నెల 10, 11, 12 తేదిల్లో ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగు భూముల కోసం 13న సదస్సు

కూడేరు, గార్లదిన్నె, పుట్లూరు, శింగనమల మండలాల్లో ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదల సమస్యలపై ఈ నెల 13న అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ తెలిపారు. త్వరలో జరగున్న అసైన్డ్ కమిటీ సమావేశాల్లో పేదల భూములను పెత్తందార్లు తమ పేర్లతో రాయించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పలు మండలాల్లో కొండలు, గుట్టలు, దళిత శ్మశాన స్థలాలు, ప్రభుత్వ భూములు కబ్జా కావడం పెరిగిపోయిందన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని నిర్వహిస్తున్న సదస్సును, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిబంధనలు మరిచారు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఉక్కడా లేని విధంగా దాదాపు 9 ఎకరాల్లో హిందూపురం పట్టణ నడిబొడ్డున పురపాలక సంఘం వారు రూ.30 కోట్లు వెచ్చించి నూతన వాణిజ్య సముదాయం నిర్మాణం చేపట్టారు. వీటికి వేలం పాటలు వేసి ఏడాది గడిచింది. దీనిని రెండో సారి ప్రారంభించి కూడా ఏడు నెలలు పూర్తి అయింది. వాణిజ్య సముదాయ భవనంలో వేలం పాటలో గదులు తీసుకున్న వారు అందులో వ్యాపారాలు ప్రారంభించలేదు. మున్సిపల్ అధికారులు వ్యాపారులకు చెప్పిన విధంగా సౌకర్యాలు కల్పించక పోవడంతోనే వ్యాపారులు సుముఖత చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్కెట్‌లో అడుగుపెట్టని వ్యాపారులు
వృథాగా వాణిజ్య సముదాయ భవనాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కూరగాయాల మార్కెట్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో టిడిపి ప్రభుత్వం హయాంలో దానిని కూల్చివేశారు. అదే స్థానంలో రూ.100 కోట్లతో నూతనంగా అన్ని సౌకర్యాలతో కూరగాయాల మార్కెట్‌తో పాటు వాణిజ్య సముదాయం, చికెన్, మటన్, చేపలు, పూలు, పండ్లు ఇలా ప్రతి ఒక్కటి అక్కడే ప్రజలకు అందే విధంగా నిర్మాణం చేస్తామని చెప్పారు. అప్పటికే అక్కడ వ్యాపారాలు చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇచ్చి గుడ్‌విల్ లేకుండా గదులు కేటాస్తామని చెప్పారు. అయితే రూ.100 కోట్లు కాదు కదా కనీసం రూ.50 కోట్లతో కూడా మార్కెట్ నిర్మాణం చేపట్ట లేకపోయారు. చివరకు ఎన్నికలు సమీపించడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు, పురపాలక సంఘం రూ.3 కోట్లు, గుడ్ విల్ రూపంలో రూ.10 కోట్లు మొత్తం రూ.23 కోట్లతో మార్కెట్ నిర్మాణం ప్రారంభించారు. అది ఇంకా పూర్తికాక ముందే అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే బాలకృ చేతుల మీదుగా దానిని ప్రారంభించారు. ప్రారంభించి రెండు సంవత్సరాలు గడిచిన అనంతరం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాలకవర్గ సహకారం, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సూచన మేరకు మార్కెట్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి నిర్మాణం పూర్తిచేశారు. దీంతో పాటు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. దీంతో పాటు కూరగాయాల వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి దానిని సైతం ప్రారంభించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూల వ్యాపారాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూవచ్చారు. అయితే వాణిజ్య సముదాయంలో అవసరమైన సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించలేదని ఆరోపిస్తూ అక్కడ ఎవరూ వ్యాపారాలు ప్రారంభించలేదు.

నిబంధనలు మరచిన అధికారులు

నూతన మార్కెట్, వాణిజ్య సముదాయం ప్రారంభ సమయంలో మున్సిపల్ అధికారులు వ్యాపారులకు మార్కెట్ చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు తోపుడుబండ్ల వ్యాపారాలు లేనివిధంగా చూస్తామని చెప్పారు. అయితే ఈ నిబంధనలు అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వ్యాపారులు పేర్కొంటున్నారు. మార్కెట్ ముందు తోపుడు బండ్ల వ్యాపారులు వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ లోపలికి ఎవరూరావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే వడ్డీలకు అప్పు తీసుకొచ్చి పురపాలక సంఘానికి గుడ్‌విల్ చెల్లించామన్నారు. ఇంకా పెట్టుబడి పెట్టి వ్యాపారాలు ప్రారంభిస్తే నష్టాలు వస్తే తెచ్చిన అప్పులకు వడ్డీ సైతం చెల్లించడం కష్టంగా మారుతుందని వ్యాపారాలు ముందుకు రావాడంలేదు. మార్కెట్ ముందున్న తోపుడు బండ్లను ఖాళీ చేయించి, వేలం పాట సమయంలో చెప్పిన నిబంధనలు పాటిస్తే అన్ని వ్యాపారాలూ ఒకే చోట ప్రారంభిస్తామని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే తమను ఇక్కడి నుంచి పంపిస్తే తామెలా బతకాలని తోపుడుబండ్ల వ్యాపారులు వాపోతున్నారు.

మార్కెట్ భవన సముదాయం ఎదుట తోపుడు బండ్లతో వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

సౌకర్యాలు కల్పిస్తే నెలకు రూ.18 లక్షలు ఆదాయం

పురపాలక సంఘ అధికారులు, పాలకవర్గం నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయంలో వ్యాపారులకు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తే మున్సిపాల్టీకి నెలకు సుమారు రూ.18 లక్షలు ఆదాయం వస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు మార్కెట్ కింద పూల వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలంటున్నారు. మార్కెట్ ముందు ఉన్న పురపాలక స్థలంలో గదులు నిర్మాణం చేసి కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులకు కేటాయిస్తే మరో రూ.2 లక్షలు ఆదాయం వస్తుందని చెబుతున్నారు. తోపుడుబండ్ల వారు వ్యాపారం చేసుకునేందుకు మార్గం చూపించి మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరాజుద్దీన్, లింగమూర్తి

ప్రజాశక్తి-అనంతపురం

ఉపాధ్యాయుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని, వాటిని కాపాడుకొనేందుకు మనమంతా ఐక్యంగా పోరాడుదామని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఉపాధ్యాయ భవన్ నందు ఫ్యాప్టో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తోందన్నారు. అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. ఉపాధ్యాయ బదిలీల జీవోలలో అనేక నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. అందువల్లనే ఎక్కువ మంది ఉపాధ్యాయులు కోర్టులను ఆశ్రయించారన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి డిఎ ఇవ్వలేదని, వేతనాలు కూడా ఒకటవ తేదీకి ఇవ్వడం లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఫ్యాప్టో ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలియజేశారు

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఎస్.సిరాజుద్దీన్ (ఎపిటిఎఫ్-257) సెక్రటరీ జనరల్‌గా జి లింగమూర్తి (ఎస్ఎపి) కో ఛైర్మన్లుగా బి.పురుషోత్తం (డిటిఎఫ్), జావిద్అహ్మద్ (ఆర్‌యుటిఎ), పెద్దన్న (ఎస్‌టి, ఎస్‌సి, యుఎస్), చిరంజీవులు (బిటిఎ) డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా వై.గోవిందరాజులు (యుటిఎఫ్), ఎన్.రమణారెడ్డి(ఎస్‌టియు), శ్రీనివాస్‌రెడ్డి (ఎపిటిఎఫ్ 38), కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ (హెచ్ఎంఎ), కోశాధికారిగా సి.గోపాల్‌రెడ్డి (ఎపిపిటిఎ) కార్యవర్గ సభ్యులుగా వెంకటేశులు (ఎపిటిఎఫ్-257), జి.సూర్యుడు (ఎస్‌టియు), పి,శివశంకర్ (ఎస్ఎపి), జి.రవీంద్ర (ఎపిటిఎఫ్ 1938), జార్జ్ (డిటిపి), ఎం జైరాంరెడ్డి (హెచ్ఎంఎ), ఎస్.హర్షద్ (ఆర్‌యుటియు), బి.శంకర్ (ఎపిపిటిఎ), వెంకటేశులు (ఎస్‌సి ఎస్‌టియుఎస్), జిఆర్.మహేష్ (బిటిఎ), సి.లింగమయ్య (యుటిఎఫ్) లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి నరసింహులు, వెంకటేశులు, సూర్యనారాయణ గౌడ్, రామసుబ్బారెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-ఉరవకొండ

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప డిమాండు చేశారు. ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణంలోని ఎస్‌కె ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణం నుంచి పాదయాత్ర చేపట్టి 2 కే వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న డిఎ లను వెంటనే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని పోరాటాలు చేసిన ఉద్యోగులపై పెట్టిన బలవంతపు కేసులు అన్నింటినీ తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఉద్యోగులకు రావాలిస్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేసి ఉద్యోగుల పట్ల నిరంకుశ విధానాన్ని వీడి స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా సహాయ అధ్యక్షులు రామప్ప చౌదరి, కార్యదర్శి సంజీవ్ కుమార్, ఉరవకొండ జోన్ నాయకులు రఘు, రాజశేఖర్, శ్రీధర్, బండయ్య, శేఖర్, శ్రీనివాసగుప్త, జయ రాములు, ఇస్లాం బాషా, మధుభాబు, ఎర్రిస్వామి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

2కె వాక్ నిర్వహిస్తున్న ఫాప్టో నాయకులు

అగ్ని ప్రమాదాల నివారణలో జాగ్రత్తలు అవసరం

సత్యసాయి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకర ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కంగారు పడకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని శ్రీ సత్యసాయి జిల్లా అగ్నిమాపక శాఖ విపత్తుల స్పందన అధికారి శంకర ప్రసాద్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదం వల్లే జరుగుతుంటాయని తెలిపారు. ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా సంభవిస్తుందన్నారు. వర్షాకాలంలో నదులు, చెరువులు, జలాశయాలు, వంకల, వాగులు ఉప్పొంగుతున్న సందర్భంలో నీటి ప్రవాహంలో చిక్కుకొని సహాయం కోసం ఎదురు చూసే బాధితులు ఉంటారన్నారు. పెద్ద పరిశ్రమల్లో ప్రమాదంలో చిక్కుకుని అలమటిస్తూ దిక్కుతోచని స్థితిలో ఉంటారన్నారు. మరికొందరు అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి ఆ మంటల్లో చిక్కుకొని బయటకు వచ్చే మార్గం లేక తల్లడిల్లి పోతుంటారన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఉన్న వారి సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక దళం సైరన్ మోగించుకుంటూ అక్కడికి చేరుకుంటుందన్నారు. సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదంలో చిక్కుకున్న బాధితులను ఎంతో సాహసం చేసి కాపాడుతుంటారని చెప్పారు. సమాజానికి ఈ శాఖ అవసరం ఎంతో ఉంటుందన్నారు. కీలకమైన అగ్నిమాపకశాఖ పనితీరు.. వారు స్పందించే విధానంపై ఆ శాఖ జిల్లా అధికారి శంకర్ ప్రసాద్ ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న : సత్యసాయి జిల్లాలో ఎన్ని అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి? ఎక్కడెక్కడ ఉన్నాయి.?

జవాబు : జిల్లా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర కేంద్రాలలో ఉన్నాయి. ప్రతి కేంద్రంలో ఒక అగ్నిమాపక వాహనం ఉంటుంది. సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలానికి చేరుకొని తగు చర్యలు చేపడతారు.

ప్రశ్న : ఇరుకైన ప్రదేశాలు, ప్రాంతాలు ఉన్నచోటికి వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో ఏం చర్యలు తీసుకుంటారు ?

జవాబు : కొన్ని పట్టణాల్లో ఇరుకైన వీధుల్లోకి అగ్నిమాపక వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అలాంటి ప్రదేశాల్లో మిస్ట్ అని వాహనం ద్వారా సిబ్బంది చేరుకుంటారు. ప్రమాదమని తెలిసినా సురక్షితులైన సిబ్బంది అక్కడికి చేరుకుని నివారణ చర్యలు చేపడతారు.

ప్రశ్న : జరుగుతున్న ప్రమాదాలపై మీ విశ్లేషణ ఏమిటి.?

జవాబు : గతంతో పోల్చుకుంటే అగ్ని ప్రమాదాలు తగ్గాయి. దానికి కారణం పూరిళ్ల స్థానంలో పక్కా గృహ నిర్మాణాలు జరగడం. గడ్డివాములు తగ్గిపోవడం, ప్రజల్లో అవగాహన పెరగడం పట్ల ప్రమాదాలు తగ్గాయి. అయితే ఇప్పుడు ఎక్కువగా గ్యాస్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాలు తక్కువగా కురుస్తున్న కారణంగా నదులు పొంగి పొర్లటం లాంటి సంఘటనలు ఇతర ప్రదేశాలతో పోల్చుకుంటే ఈ ప్రాంతాలో తక్కువే. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా వేరుశనగ పంట పెడుతున్న కారణంగా బహిరంగ ప్రదేశాల్లో వాములు వేయటం వల్ల కొందరు వ్యక్తులు సిగరెట్లు, బీడీలు తాగి ఆర్పకుండా పారవేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మానవ తప్పిదంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతుంటాయి.

ప్రశ్న : ప్రమాదాల నివారణకు మీరు తీసుకుంటున్న చర్యలు ?

జవాబు : తరచూ పట్టణాల్లో, గ్రామాల్లో ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎక్కువగా గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ప్రదర్శనలు ఇస్తుంటాం. గ్యాస్ వల్ల వచ్చే మంటలు ఏ విధంగా ఆర్పవచ్చు, ఎలా నివారించవచ్చని తమ సిబ్బంది వివరిస్తూ ఉంటారు.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచనలు సలహాలు ఏమిటి ? సిబ్బంది కొరత ఉందా ?

జవాబు : ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇస్తే తమ సిబ్బంది వెంటనే స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటారు. సిగరెట్లు, బీడీ తాగేవారు ఆర్పివేస్తే ప్రమాదాలు జరగవు. ప్రజలు అగ్ని ప్రమాదం పట్ల జాగ్రత్తలు పాటించడంతోపాటు బాధ్యతగా ప్రవర్తించాలి. సిబ్బంది కొరత గాని, యంత్ర పరికరాల సమస్య గాని లేదు.

పేద రైతులకు వైఎస్ఆర్ జలకళ వరం

మంత్రి ఉషా శ్రీచరణ్

ప్రజాశక్తి- కుందుర్పి

రైతన్న పడుతున్నటువంటి కష్టాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద రైతులకు వైఎస్ఆర్ జలకళ పథకం ద్వారా ఉచిత బోరు వేసి ఆ రైతుకు మోటర్ పంపుసెట్లు పంపిణీ చేయడమే ఓ వరమని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. ఆదివారం యర్రగుంట గ్రామంలో ఎంపీపీ కమల నాగరాజు అధ్యక్షతన ఉచిత మోటర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అర్హత గలిగిన 17,970 మంది చిన్న సన్నకారు రైతన్నల పొలాల్లో బోర్లు వేయించామన్నారు. వారందరికీ రూ.198 కోట్ల వ్యయంతో మోటారు పంపుసెట్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని 1,935 మంది రైతులకు గానూ రూ.30 కోట్లు, కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా 293 మంది రైతులకు రూ.4.5 కోట్లు లబ్ధిని చేకూరుస్తూ పంపిణీ చేశామని తెలియజేశారు. ఆదివారం కళ్యాణదుర్గం నియోజకవర్గం యర్రగుంట గ్రామంలో బోయ మంజులమ్మ అనే సన్నకారు మహిళా రైతుకు రూ.1.93 లక్షలతో మంజూరు అయిన మోటారు పంపు సెట్‌ను నేరుగా పొలంలోకి వెళ్లి అందజేశారు. మోటారును ప్రారంభించిన అనంతరం యర్రగుంటలో నిర్వహించిన సభలో పాల్గొని రైతన్నలకు మోటారు సెట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, గ్రామ సర్పంచి విశాలాక్షి, వైస్ ఎంపీపీ బీజే సోమనాథ్, సింగిల్ విండో ఛైర్మన్ వన్నూరు రెడ్డి, వాల్మీకి స్టేట్ డైరెక్టర్ పాలాక్షి, కురుబ సంఘం మండల అధ్యక్షుడు కేపీ గోపాల్, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఈ.రాము, శెట్టూరు, కుందుర్పి మండలాల ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మోటారు పంపుసెట్లను పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పాదయాత్ర చేసి తీరుతా..

మాజీమంత్రి కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో మూడున్నరేళ్లుగా సాగుతున్న ఇసుక దోపిడీ, సహజ సంపదను కొల్లగొట్టడంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పాదయాత్ర చేసి తీరుతానని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విప్ 'కాపు' బళ్లారి, బెంగళూరు నగరాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వైసిపి నాయకుల దోపిడిపై గతంలో పాదయాత్ర చేయడంతోపాటు ఇసుక రీచ్‌లను సందర్శించి, సాక్షాధారాలతో నిరూపించామన్నారు. ప్రస్తుతం బొమ్మనహాల్, కనేకల్లు మండలాల్లో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోందన్నారు. ఇసుక దందాతో తిమ్మలాపురం గ్రామంలో దాదాపు 850 వ్యవసాయ బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. హగరి, చిన్న హగరి నదుల్లో ఇసుక తవ్వకాల ద్వారా కాపు కుటుంబానికి నెలకు సుమారు రూ.1.20 కోట్ల వరకు ఆదాయం వస్తోందని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇసుక దందాను సాగిస్తున్న వైసీపీ నాయకులను ప్రశ్నిస్తే, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానేకాపు చేసిన అవినీతి, అక్రమ దందాలను సాక్షాధారాలతో బట్టబయలు చేస్తానని స్పష్టం చేశారు. వైసిపి నాయకులు సాగిస్తున్న అక్రమ ఇసుక దందాను ప్రజలకు వివరించడానికి ఉద్దేహాల్ నుంచి తిమ్మలాపురం వరకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. అయితే శాంతియుతంగా నిర్వహిస్తున్న పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. పాదయాత్ర నిర్వహణ కోసం తాము ముందుగానే పోలీసులకు తెలియజేశామన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు, అడుగడుగునా ఆంక్షలు విధించినా తాము రైతుల కోసం పాదయాత్ర చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు పాల్గొన్నారు.

పాదయాత్రకు పోలీసుల అనుమతి లేదు

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు నియోజకవర్గంలో తలపెట్టిన పాదయాత్రకు పోలీసు శాఖ అనుమతి లేదని రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా కాలవ పాదయాత్ర చేపడితే, వ్యతిరేకంగా తాము కూడా పాదయాత్ర చేస్తామని ప్రత్యర్థి రాజకీయ పార్టీ నాయకులు ప్రకటించిన నేపథ్యంలో అనుమతి ఇవ్వలేదన్నారు. కావున ఎవరైనా పోలీసు అనుమతి లేకుండా పాదయాత్ర చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక..

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుల పాఠశాలలో 1996లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఇందులో భాగంగా అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి అక్కడే మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా వారికి చదువులు చెప్పిన ఉపాధ్యాయులు అబ్రహం, వెంకటస్వామి, నారాయణ, కెఎల్ఎన్ ప్రసాద్, శివారెడ్డి, కాశప్ప, రహమత్‌బి, మస్తాన్‌వలి, వెంకటనాయుడు, బేగం, పార్వతమ్మ, నాగలక్ష్మి, సులోచన, సహాయ మేరీ, చంద్రశేఖర్, వివేకానందరెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, బ్రహ్మాచారి, ప్రసాద్, నారాయణస్వామి, బాషా, మద్దిలేటి, నార్పల మండల విద్యాధికారి కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు గుత్తి సునీల్‌కుమార్‌రెడ్డి, వల్లం రమేష్‌బాబు, రామకృష్ణ, కిషోర్‌కుమార్‌రెడ్డి, తుంపెర తిరుపాల్, రామలింగ, గంగాధర్, ఆకుల కిషోర్, సాంబశివుడు, శ్రీకాంత్ రెడ్డి, బలనాగి శ్రీనివాసులు, నాగార్జున, హైదర్‌బాషా, రమేష్, హనుమంత రెడ్డి, బలనాగి లక్ష్మీనారాయణ, రాము, జగన్, గురు, సెక్ష, చంద్రమోహన్ రెడ్డి, వెంకట నాయుడు, సరళ, హైమావతి, కళావతి, శంషాద్, రమాదేవి, అరుణ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసి పేదలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చంద్రగిరి గ్రామంలో మాజీ ఎంపిటిసి జయరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి చేయడమే సిఎం జగన్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాల లబ్ధిని తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే గడప గడపకూ కార్యక్రమం చేపట్టారన్నారు. కావున మరోసారి జగన్‌ను సిఎంగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ప్రభావతమ్మ, ఎంపిటిసి, వైసిపి కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఎంపిపి పద్మ, ఉపఎంపిపి రమేష్ నాగరత్నమ్మ, సిద్ధరాంపురం సర్పంచి ఆంజనేయులు, అరేసముద్రం సర్పంచి తిప్పేస్వామి, నేమకల్లు సర్పంచి పరమేశ్వర, నాయకులు గాదిలింగ యోగేశ్వర్‌రెడ్డి, కృష్ణ, ముక్కన్న ఎంపిటిసిలు, వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, రామాంజనేయులు, ఎంపిడిఒ షకీలాబేగం, తహశీల్దార్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని నడిమివంకకు రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని 45, 47వ డివిజన్లలో కార్పొరేటర్లు చంద్రమోహన్‌రెడ్డి, దుర్గాదేవితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం వర్షాలు ఎక్కువగా పడి నడిమివంక పొంగిపొర్లడంతో చుట్టుపక్కల పలు డివిజన్లు జలమయం అయ్యాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నడిమివంకకి రక్షణ గోడను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు. పేదల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం తమదన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వైసిపి అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మృతిచెందిన సాయితేజ

గుత్తి : పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లు మండలం పాత కొత్త చెరువు గ్రామానికి చెందిన సాయితేజ (21) తమ సమీప బంధువు యాడికి మండలం రామరాజుపల్లికి చెందిన శివరంగాతో కలిసి గుత్తి మండలంలోని బాట సుంకలమ్మ ఆలయం వద్ద జరిగిన దేవరకు ద్విచక్ర వాహనంలో వచ్చారు. భోజనం చేసిన అనంతరం తిరిగి స్వగ్రామాలకి వెళ్తుండగా పట్టణ శివారులోని ఓ డాబా ఎదురుగా 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. శివరంగా తీవ్రంగా గాయాపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు

పుట్లూరు : మండలంలోని సూరేపల్లి గ్రామంలో ఆదివారం ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తుల వివరాల మేరకు.. యాడికి మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన రాజేష్, చంద్రమోహన్ సూరేపల్లి మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. గమణించిన స్థానికులు 108 ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తెగిపడిన 11 కెవి విద్యుత్ లైన్..తృటిలో తప్పిన ప్రమాదం



తెగిన విద్యుత్ లైన్

ఆత్మకూరు : మండలంలోని పి.సిద్ధరాంపురం గ్రామ సమీపంలో 11 కెవి విద్యుత్ లైన్ ఆదివారం తెగిపడ్డాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్టయింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. ఏదైనా జరగరానిది జరిగి ఉంటే ఏం చేస్తారమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ లైన్లు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గోడ పత్రికలు విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని సమగ్రంగా అమలు ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు అనేక నేరాలు, అగౌరవాలు, వేధింపులు, ఛీత్కారాలు, మానసిక హింసకు గురువుతున్నారన్నారు. ఫలితంగా ఆస్తులు, ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని నిరోధించడానికి ఎస్సీ, ఎస్టీల రక్షణ కోసం వచ్చిన ఉద్యమాల ఒత్తిడితో ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టం 1989 లో వచ్చిందన్నారు. అమలులో ప్రభుత్వ పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు యంత్రాంగం దృష్టి సారించి దళిత, గిరిజనుల రక్షణాగా ఉన్న అట్రాసిటి చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు డాక్టర్ సి.తిరుపాలు, దళిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్లన్న, జిల్లా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చిన్న ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కెవిపిఎస్ నగర అధ్యక్షులు అక్కులప్ప, ఉపాధ్యక్షులు మల్లెల ఎర్రిస్వామి, సహాయ కార్యదర్శి నరసింహా, నల్లప్ప, శివ, పుల్లన్న, కుమార్, ప్రసాద్, జీవరత్నం, రాజా, వన్నూర్, సునీల్, వన్నూరప్ప, వెంకటేష్, గోపీ, అజిత్, రామకృష్ణ, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహమ్మద్

ప్రజాశక్తి-ఉరవకొండ

మైనార్టీల అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ పాలన అందిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహమ్మద్ అన్నారు. అనంతపురం జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా మీరం బాషా నియమితులైన సందర్భంగా ఆదివారం పట్టణంలోని పాతబజార్ గర్ల్స్ హైస్కూల్ సమీపంలో సన్మానసభ ఏర్పాటు చశారు. ముందుగా బాబా ఫక్రుద్దీన్ జెండా కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ సిఎం అయినప్పటి నుంచి కెబినెట్‌తోపాటు వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర ఛైర్మన్ల నియామయాల్లో 60 శాతం పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించారన్నారు. ఒక మైనారిటీకి డిప్యూటీ సీఎంను చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. అదేవిధంగా మండలి ఛైర్మన్‌ను ముస్లింను చేశారన్నారు. ఐదుగురికి ఎమ్మెల్యే టికెట్లు, ఎమ్మెల్సీ టికెట్టు ఇచ్చి మైనార్టీల పట్ల జగన్ తనకున్న ప్రేమను చాటుకున్నారని తెలిపారు. ఇకపోతే ఉరవకొండలో మూడు వేల ఇళ్ల పట్టాలిస్తే అందులో 1100 మంది మైనార్టీలకు స్థలాలు ఇచ్చామని గుర్తు చేశారు. అదేవిధంగా మహిళా సంఘాల రుణమాఫీలో స్థానిక ముస్లిం మహిళలు 500 మందికి న్యాయం చేశారన్నారు. పట్టణంలోని ఉర్దూ పాఠశాల అభివృద్ధికి నాడు-నేడు కింద రూ.28 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు అనేక కార్యక్రమాల్లో ముస్లింలకు న్యాయం చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, యువనేత ప్రణయ్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు వైస్‌ఛైర్మన్ అహమ్మద్‌బాషా, జాయింట్ సెక్రటరీ ఖాజా, ఖతిమ్‌అబ్దుల్‌హై, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, వార్డు సభ్యులు శర్మస్, ఎంపిటిసి హోన్నూరుసాబ్, కో అప్షన్ సభ్యులు లతీఫ్, షహవాజ్ బేగం, గుత్తి బాను, నాయకులు అన్వర్, తాజు, ఆసీఫ్, కప్పట్రాళ్ల జాఫర్, అయ్యర్ దాదు, జెండా జీలన్, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మైనారిటీలు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వాలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం : నగరంలోని లెక్చరర్స్ కాలనీలో వాలంటీర్‌గా పని చేస్తున్న షర్మిల భర్త మహమ్మద్ రఫీ (35) ఇటీవల గుండెపోటుతో మరణించడంతో కాలనీ అసోసియేషన్ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసుల నుంచి వసూలు చేసిన రూ.31,500 మొత్తాన్ని షర్మిలకు అందజేసి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కృష్ణారెడ్డి, అధ్యక్షులు విశ్రాంత ఆర్ఐఒ క్రిష్టప్ప, సెక్రటరీ వెంకటరంగయ్య, కోశాధికారి దామోదర్‌రెడ్డి, సభ్యులు మస్తానప్ప, టీవి.రెడ్డి, నారాయణ, ఉమామహేశ్వరి, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జెవివి క్యాలెండర్ల ఆవిష్కరణ

గుత్తి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం విడుదల చేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, మండల నాయకులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రామాంజనేయులు, పి.వెంకటరామిరెడ్డి, సయ్యద్‌బాషా, బసవరాజు, సిపిఐ నాయకుడు పూలమాబు తదితరులు పాల్గొన్నారు.

జలకళ బోరు పనులు ప్రారంభం

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ మామిళ్లచెరువు గ్రామంలో ఆదివారం వైఎస్ఆర్ జలకళ పథకం కింద బోరు పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా రైతు నాగిరెడ్డి పొలంలో వైసిపి మండల బీసీ సెల్ అధ్యక్షుడు సుద్దుల రాముయాదవ్, సర్పంచి ఆర్.గురుమస్తాన్, జిల్లా కార్యదర్శులు మామిళ్ల చెరువు నాగిరెడ్డి, ఎస్ సుధాకర్ యాదవ్ భూమిపూజ చేసి బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. జలకళ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.సురేష్‌యాదవ్, రామకృష్ణ, హరి, తదితరులు పాల్గొన్నారు.

రజకులపై ప్రభుత్వం చిన్నచూపు

ప్రజాశక్తి-గుంతకల్లు

రజక వత్తిదారులను వైసిపి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో నిర్వహించిన రజక వృత్తిదారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులకు బీసీ కార్పొరేషన్, సొసైటీల ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన రజకులకు పింఛన్ ఇవ్వాలని, పట్టణాల్లో ఉన్న దోబీ ఘాట్లకు ప్రహరీలు నిర్మించాలని, లాండ్రీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు రాము, కార్యదర్శిగా సి.గంగరాజు, ఉపాధ్యక్షులుగా నటరాజు, సహాయ కార్యదర్శిగా రవి, కమిటీ సభ్యులుగా సుధాకర్, సుంకన్న, లక్ష్మీనారాయణ, రాజు, శ్రీనివాసులు, రాము, గోవిందు, నారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల నుంచి కాపాడండి

పోలీస్‌స్టేషన్‌లో గడేకల్ సచివాలయ సిబ్బంది ఫిర్యాదు

ప్రజాశక్తి-ఉరవకొండ

గడేకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్.తిమ్మాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమను వేధిస్తున్నారని, తమను కాపాడాలని సచివాలయ సిబ్బంది కోరారు. ఈమేరకు గడేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడేకల్ పంచాయతీ ఎన్.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎర్రన్న గారి రామాంజనేయులు, పశువుల నాగరాజు, నాగన్న తరచూ సచివాలయం వద్దకు వచ్చి వివిధ సమస్యలు చెబుతూ వేధిస్తున్నారన్నారు. గ్రామంలో నిత్యం వీధిలైట్లు, శానిటేషన్,పారిశుభ్రత తదితర పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నప్పటికీ వివిధ రకాల సమస్యలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా కనీసం మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా ఏకవచనంతో మాట్లాడుతూ చెప్పడానికి వీలు రాని మాటలు మాట్లాడుతున్నారని వాపోయారు. పంచాయితీ సెక్రటరీ సోమయ్యను కులం పేరుతో దూషించి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారి బాధలు భరించలేకే తాము ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటస్వామి గడేకల్, ఎన్.తిమ్మాపురం గ్రామాల్లో సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. ఉద్యోగులు సక్రమంగా పనులు చేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలేగానీ దుర్భాషలాడడం తగదని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

ప్రశ్నించే గొంతులను నొక్కాలనుకోవడం బాధాకరం

అఖిలపక్షం నాయకులు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతుకలను తొక్కాలని భావించి రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రి నల్ల జీవోలను తీసుకురావడం బాధాకరమని అఖిలపక్షం నాయకులు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలను, ప్రశ్నించే గొంతులకు సంకెళ్లు వేయడానికి బ్రిటిష్ కాలం నాటి జీవోను తీసుకొచ్చిందన్నారు. రోడ్లమీద సభలు, సమావేశాలు పెట్టకూడదని నిరంకుశంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో వారే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి చింతా పురుషోత్తం, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు టి.ఆదినారాయణ మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు వై.నాగభూషణం మాదిగ, కురుబ సంఘం నాయకులు రోషన్, వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడు టి.రామకృష్ణ, వడ్డే సంఘం నాయకులు చిన్న కాశీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

కురుబ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ విడుదల

బుక్కరాయసముద్రం : ఉమ్మడి అనంతపురం జిల్లా కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆదివారం మండల కేంద్రంలో ఉన్న ఉజ్జిన్నప్ప స్వామి దేవస్థానంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, కురుబ ఉద్యోగుల సంక్షేమ అధ్యక్షులు దండు వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి కంబెళ్ల రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులేష్, ఉద్యోగులు రామకృష్ణ, బండి సుబ్రహ్మణ్యం, పిడుగు శ్రీనివాసులు, మారుతి, లింగమయ్య, వెంకటేష్, రేణుక, శంకరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి అధినేత చంద్రబాబు పాలనతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నియంత పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా వంటగ్యాస్, పెట్రోలు, విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని మోయలేక సామాన్యుల నడ్డి విరుగుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కు ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టిడిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బర్ధివలి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మోడే శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచులు నాగేంద్ర, శ్రీనివాస్‌చౌదరి, వెంకటరాముడు, మాజీ కౌన్సిలర్ సుంకన్న, నాయకులు నారాయణస్వామి, అగ్గిరాముడు, హనుమంతురెడ్డి, ఇమామ్‌వలి, మోహన్‌దాస్, మల్లికార్జున, ఆదినారాయణ, బాల రంగారెడ్డి, మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

9న విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : కార్మిక కర్షక రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9వ తేదీన విజయవాడలో ఎంబి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్యంలోనూ కార్మికులు, కర్షకులు, మూడు పూటలా తినడానికి తిండి లేని పరిస్థితి నెలకొందన్నారు. స్వాతంత్ర ఫలాలు పేదలకు అందలేదని, బడా బూర్జువా భూస్వామ్య పెట్టుబడి దారులకు, పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు దక్కాయన్నారు. ఇవాళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమే పనిగా పెట్టుకున్నదన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని కార్మికులకు కనీస వేతనాలు పాతాళంలో ఉన్నాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను పెంచి సామాన్య పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలన చేస్తున్నాయని విమర్శించారు. పెరుగుతున్న ధరలను తగ్గించి రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆహార భద్రత చట్టం ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలని కోరారు. 55 సంవత్సరాల నిండిన పేదలకు నెలకు రూ. 5 వేలు పింఛన్లు ఇవ్వాలన్నారు. నేడు విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సుకు అఖిల భారత రైతు సంఘం జాతీయ కార్యదర్శి విజూ క్రిష్టన్, సిఐటియు జాతీయ నాయకులు ఎం.ఎ.గఫూర్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు విటి.రామాంజినేయులు, బిహెచ్.రాయుడు, పోతలయ్య పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

In the court of the 1st Addl.Junior Civil Judge, Ananthapuramu
O.S.No: 1114/2019

Between:
Andhra Pragathi Grameena Bank, rep by its Branch Manager Sai Junior Collage Branch, Ananthapuramu. **...plaintiff**
And
K.Ravi Kumar **...Defendant**

Notice to Defendant.

K.Ravi Kumar S/o K. Bhaskar Gupta,
D.No.28-3-244, Tharakanatha Colony,
Ananthapuramu Town.

పై దావా నందు వాది బ్యాంకుకు రావల్సిన బాకీ మొత్తము రాబట్టుకొనుటకై ప్రతివాది అయిన మీ మీదా దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు స్వయముగా గానీ, లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు నందు తేది:22-02-2023 న హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున దావా తీర్మానించెదరని తెలుపడమైనది.

(By order of the court)

వాయిదా తేది: 22/02/2023

B.NAGALINGAM, MA,BL,
Advocate for plaintiff
Cell:9440759948

In the court of the Principal Junior Civil Judge, Ananthapuramu
O.S. No: 476/2018

Between:
Andhra Pragathi Grameena Bank, rep by its Senior Manager, Tapovanam Branch, Ananthapuramu. **...plaintiff**
And
Anjali Nallamma & another **...Defendants**

Notice to Defendants

D1: Anjali Nallamma w/o A.Bojjanna, D.No.1/825, Stalin Nagar, A.Narayanapuram Village, Ananthapuramu Rural Mandal & Dist.
D2: Jangala Seena S/o J.Eswaraiah, D.No.1-825, ASR Nagar, A.Narayanapuram Village, Ananthapuramu Rural Mandal & Dist.

పై దావా నందు వాది బ్యాంకుకు రావల్సిన బాకీ మొత్తము రాబట్టుకొనుటకై ప్రతివాదులపైన దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాదులు అయిన మీరు స్వయముగా గానీ, లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు నందు తేది:19-01-2023 న హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున దావా తీర్మానించెదరని తెలుపడమైనది.

(By order of the court)

వాయిదా తేది: 19/01/2023

B.NAGALINGAM, MA,BL,
Advocate for plaintiff
Cell:9440759948

ఎపిటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉరవకొండ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) నూతన డైరీని ఆదివారం స్థానిక చౌడేశ్వరి కాలనీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎపిటిఎఫ్ నాయకులు నాతో డైరీ ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ఇకపోతే ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా ఉంటుందన్నారు. ఈ ఎపిటిఎఫ్ నాయకులు హనుమప్ప, సాకే భాస్కర్, నజీర్, రాజేష్, దాదా ఖలందర్, వెంకట్, వేణు, ఉమామహేశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి పట్టి వాగుతున్న వైసిపి నాయకులు

విలేకరులతో మాట్లాడుతన్న జనసేన నాయకులు ఈశ్వరయ్య

బుక్కరాయసముద్రం : వైసిపి గ్రామ సింహాలకు పిచ్చి పట్టి వాగుతున్నాయని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కుప్పంలో జరిగిన ఘటనలపై చంద్రబాబును పరామర్శించేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెళ్తే వైసిపి మంత్రులు, నాయకులు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ప్రతిపక్ష నాయకులు కలిసి మాట్లాడితే మీకెందుకు ఉలుకు అని ప్రశ్నించారు. వైసిపి నాయకులు, మంత్రులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ప్రతిపక్షాలపై ఇష్టమొచ్చినట్లు వాగడం అలవాటుగా మారిపోయిందన్నారు. చేతనేతే రాష్ట్రానికి మేలు చేయండి.. లేకపోతే ప్రజలకు క్షమాపణలు చెప్పి మీ పదవుల నుంచి తప్పకుంటే మర్యాదపూర్వకంగా ఉంటుందన్నారు. అంతేగానీ లేనిపోని విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

సంసిద్ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఆదివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఫన్‌స్టాల్స్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీవాణి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలు, సంస్కృతులను కాపాడే దిశలో తెలుగు పండుగలను అందరూ ఘనంగా జరుపుకోవాలన్నారు. ఇందులో భాగంగానే తమ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అలాగే స్థానిక వైశ్య వసతి గృహం ప్రాంగణంలో అనంతపురం టౌన్ ఆఓపా మహిళా విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించగా 60 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఆవుప అధ్యక్షులు జనార్ధన్ కార్యదర్శి మంజునాథ ఆవుప మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ కార్యదర్శి ట్రెజరర్ ఇంద్ర భువన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

రాయదుర్గం : పట్టణంలోని హాటకేశ్వర స్వామి ఆలయం, స్వకులసాలి సమాజ సత్రంలో శ్రీరాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు కాంబ్లే విమల అధ్యక్షత నిర్వహించిన ఈపోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో 24 మంది బాలికలు, మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఆర్.వి తారకుమారి, ఈ సరస్వతి, కె కవిత న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్వకులసాలి సమాజ రాయదుర్గం శాఖ అధ్యక్షులు సఫారె వెంకటేశులు, మాజీ అధ్యక్షులు సూరే సుందర్రావు, కార్యదర్శి లక్ష్మీనారాయణ , మహిళా మండలి కార్యదర్శి హొట్టే సరస్వతి, కార్యవర్గ సభ్యులు, సమాజ బాంధవులు మహిళలు పాల్గొన్నారు.

సంసిద్ పాఠశాలలో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న అధ్యాపకులు